

నాటకం.. తల్లి లాంటిది

- నెలనెలా వెన్నెల ఇలాగే విరాజిల్లాలి
- ప్రముఖ రచయిత, సినీ నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు దశరథ్
- నేటితో ముగియనున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

6



పాలేరుకు జలకళ

- జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో
- 22 అడుగులకు చేరిన నీటిమట్టం
- రెండోజోన్ ఆయకట్టుకు నీటి విడుదల పెంపు

కూసుమంచి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):పాలేరు జలాశయం జలకళను సంతరించుకుంది. 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉంది. ప్రస్తుతం 22 అడుగుల మేర (2.351 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. సాగర్ డ్యాం నుంచి 4,438 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అదేవిధంగా పాలేరు పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో సుమారు 1,200 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. అదేవిధంగా ఖమ్మం జిల్లా రెండోజోన్ ఆయకట్టుకు 4,007 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. పాతకాలువకు 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 135, భక్త రామదాసు ప్రాజెక్టు ద్వారా 275 క్యూసెక్కులు, 16, 17 బ్రాంచ్‌కెనాల్‌కు 471 క్యూసెక్కులు, మంగాపురం మేజర్‌కు 243 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఐబీ అధికారులు తెలిపారు. మరో అడుగు నీరు చేరితే పాలేరు జలాశయం అలుగులు పారే అవకాశం ఉంది.



జలకళను సంతరించుకున్న పాలేరు జలాశయం



హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ



ఖమ్మంలో మంత్రి పొంగులేటికి రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుళ్లు

ఉమ్మడి జిల్లాలో

రాఖీ సందడి

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొత్తగూడెం కల్చరల్/ ఖమ్మం ఖానాపురం హవేలీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాఖీ పండుగ సందడి నెలకొంది. శనివారం ఆడపడుచులంతా తమ సోదరులకు రక్షలు కట్టి.. తమ ప్రేమానురాగాలను పంచుకున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆడపడుచుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అలాగే రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మహిళా కానిస్టేబుళ్లు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తమకు అండగా నిలవాలని ఈ సందర్భంగా వారు మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మహిళ కానిస్టేబుళ్లకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పదేళ్ల కల.. తీరనున్న వేళ

సాకారమైన జవహర్ ఎత్తిపోతల పథకం

- జోన్ 3 సాగర్ ఆయకట్టుకు మరింత ఆయుష్షు
- ఏడాది క్రితమే జోన్ 2లోకి మారిన మధిర, ఎర్రుపాలెం భూములు
- 33 వేల ఎకరాల స్థిరీకరణకు రూ.600కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్
- నేడు వంగవీడు వద్ద శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి
- పాల్గొననున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీహరి



సిద్ధమవుతున్న శంకుస్థాపన పైలాన్

మధిర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఆయకట్టులోని జోన్ 2లో ఉన్న రైతులు పంట కోసుకుంటుంటే.. జోన్ 3లో ఉన్న రైతులు మాత్రం విత్తనాలు వేసుకునే పరిస్థితి ఉండేది. దీనికి త్వరలోనే చెల్లు చీటి చెప్పి జోన్ 3 రైతులు కూడా ఆగస్టులోనే విత్తనాలు చల్లుకునే రోజు కోసం దశాబ్దాలుగా కంటున్న కలలు సాకారం కానున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పట్టు వదలని విక్రమార్కుడిలా ఉమ్మడి రాష్ట్రంలో శ్రీకారం చుట్టిన ఎత్తిపోతల పథకానికి.. ఇప్పుడు శంకుస్థాపన చేస్తున్నారు. మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో జోన్ 3లో ఉన్న సాగర్ ఆయకట్టును జోన్ 2లోకి మార్చి ఆ ఆయకట్టును స్థిరీకరించేందుకు రూ.600 కోట్లతో మధిర మండలం వంగవీడు గ్రామం వద్ద వైరా నదిపై జవహర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనున్నారు. ఈ పథకానికి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సాగర్ కాలువలు తవ్వి దశాబ్దాలు కావస్తున్నా.. జోన్ 3లో ఉన్న ఈ మండలాల్లోని ఆయకట్టుకు డిసెంబరు తరువాతే నీళ్లు వచ్చేవి. ఈ నీళ్లు కూడా ఏపీ భూభాగంలో ఉన్న కాలువల ద్వారా వైలవరం బ్రాంచ్ కెనాల్ నుంచి రావాల్సి ఉండటం, ఎర్రుపాలెం, మధిర మండలాల భూములు టెయిల్‌ఎండ్‌లో ఉండటంతో అరకొరగానే అందేవి. ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు

(మిగతా 6వ పేజీలో)

అక్రమాలు

నిగ్గుతేలేదెన్నడు?

- సింగరేణి సొసైటీ అక్రమాలు జరిగి పదేళ్లు దాటిన వైనం
- అక్రమార్కులను విడిచి అధికారులపై వేధింపులు
- దశాబ్దం పూర్తయినా కార్మికులకు అందని డిపాజిట్లు





ఇల్లెందు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులు.. డిపాజిట్ల ద్వారా పొదుపు చేసుకుని ఆర్థిక ప్రయోజనాలు పొందడంతో పాటు ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు ఏర్పడిన క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలు గాడి తప్పుతున్నాయి. కార్మికుల కోసం కార్మిక ప్రతినిధులే కార్యనిర్వాహక వర్గంగా ఏర్పడి నిర్వహిస్తున్న క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీల్లో కూడా ఎకంచే చేనుమేసింద్ చందంగా బోగస్ డిపాజిట్లు సృష్టించి కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టారని, ఈ ఉదంతంలో చెక్ పవర్ కలిగి ఉన్న అధికారులను బలిపశువులుగా మార్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో ఇల్లెందులో 21 ఇంక్లైన్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో వెలుగు చూసిన కుంభకోణంలో కార్మికుల డిపాజిట్ల సొమ్ము.. బొగ్గు గని మూతపడి దశాబ్దం దాటుతున్నా కార్మికులకు డిపాజిట్ల సొమ్ము చెల్లించకపోవడం, అధికారులపైనే ఆరోపణలు సాగిస్తూ వారి నుంచి సొమ్ము రాబట్టేందుకు జరుగుతున్న యత్నాలు జరుగుతుండటం గమనార్హం. అయితే అక్రమాలతో సంబంధం లేని కొందరు అధికారులు కూడా తమపై మోపిన కేసుల మూలంగా పదోన్నతులు,

(మిగతా 6వ పేజీలో)



గిరిజన మ్యూజియంకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, పీవో

గిరిజనాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో

పని చేస్తున్నాం

- ఆదివాసీ సంప్రదాయాలకు ప్రపంచస్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం
- మన్యం మహనీయులకు నివాళి
- గిరిజన మ్యూజియం టేబుల్‌బుక్ ఆవిష్కరణ
- హాజరైన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్

6

ప్రభుత్వ భవనాలపై 'సోలార్'

- ఇందిరా సౌర గిరి జల వికాసాన్ని వేగిరం చేయాలి
- ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల వివరాలు పంపాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఖమ్మంలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్.. భద్రాద్రి నుంచి కలెక్టర్ జితేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని మంత్రి వర్గం విధాన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలుపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, రెడ్కో సీఎండీ అనిలా తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. భద్రాద్రి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లను హైదరాబాద్‌కు పంపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ ఒకే నమూనాలో ఉన్న నేపథ్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపించాలని డిప్యూటీ సీఎం సూచించారు. గ్రామ పంచాయతీ భవనం నుంచి సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్టు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల

(మిగతా 6వ పేజీలో)

ఐవీఎఫ్ కేంద్రాలపై ఉన్నతాధికారుల ఆరా

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐవీఎఫ్ (సంతాన సాఫల్య కేంద్రాల)పై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఈ మేరకు ప్రత్యేక బృంద సభ్యులు శనివారం ఖమ్మం నగరంలోని పలు ఐవీఎఫ్ కేంద్రాల్లో తనిఖీ చేసినట్టు సమాచారం. ఖమ్మంలో మొత్తం 10 ఐవీఎఫ్ కేంద్రాలు ఉండగా.. వీటిలో 8 రిజిస్టర్ అయి ఉన్నాయి. మరో రెండు కొత్తగా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా డీఎంహెచ్‌వో తనిఖీల అనంతరం అనుమతి కోసం రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలను పంపించారు. అయితే జిల్లాలో ఐవీఎఫ్ కేంద్రాలపై ప్రజల నుంచి కానీ, ఇతర ఫిర్యాదులు ఏమైనా ఉన్నాయా, పోలీస్ కేసులు నమోదయ్యాయా అనే సమాచారాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సర్వే సత్యనారాయణ నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయానికి శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. వీటిపై ఐవీఎఫ్ కేంద్రాలపై జిల్లా అధికారులు వివరాలను నివేదించనున్నట్టు సమాచారం. అయితే రాష్ట్ర బృందాల తనిఖీని జిల్లా వైద్యాధికారులు ధ్రువీకరించలేదు.

రాఖీ కట్టేందుకు వచ్చి..



- పుట్టింటి వద్దే గుండెపోటుతో మహిళ మృతి
- చిన్న అన్నకు రక్ష కడుతూ కుప్పకూలిన వైనం
- ఖమ్మం జిల్లా ఆత్కూరులో ఘటన
- స్వగ్రామం కలకోడిమలో విషాదం

6

చెట్లే తోబుట్టువులుగా..

రాఖీలు కట్టిన ఆదివాసీ మహిళలు

7

వానాకాలంలో

ఒక్క పొద్దు నాట్లు

ఇది వర్షాకాలమే అయినా.. వేసవిని తలపిస్తోంది. ఓ వైపు ఎండలు.. మరో వైపు ఉక్కపోత బాగా ఉంటుండటంతో వరినాట్లు వేసే సమయం కూడా మారింది. ఎప్పుడైనా వానాకాలంలో రెండు పూటలా వరి నాట్లు వేసే కూలీలు.. ఇప్పుడు ఒక పూట పద్ధతికి తెరలేపారు. మధ్యాహ్నం తర్వాత ఎండ వేడిమిని తట్టుకోలేక.. ఉదయం ఆరు గంటలకే పొలాలకు వస్తున్న కూలీలు.. మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాట్లు వేసి.. ఆ తర్వాత ఇళ్లకు వెళ్లిపోతున్నారు. అయితే ఆగస్టు నెలలో ఇలాంటి పరిస్థితి చాలా అరుదని రైతులు, కూలీలు అంటున్నారు. కాగా దుమ్ముగూడెం మండలంలోని చెరువులు నిండక పోవడంతో ఇరవై శాతం నాట్లు కూడా పూర్తి కాలేదు.

- దుమ్ముగూడెం, ఆంధ్రజ్యోతి



దుమ్ముగూడెంలో ఉదయం ఏడుగంటల సమయంలో నాటు వేస్తున్న కూలీలు

గిరిజనాభివృద్ధికి

ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నాం

ఆదివాసీ సంప్రదాయాలకు ప్రపంచస్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది

సేంద్రియ పంటల సాగుకు గిరిజనులను ప్రోత్సహిస్తాం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలంలో మన్యం మహనీయులకు ఘన నివాళి

గిరిజన మ్యూజియం టేబుల్ బుక్ ఆవిష్కరణ

బ్రిడ్జి సెంటర్ నుంచి ప్రత్యేక ర్యాలీ, సహపంక్తి భోజనాలు

హాజరైన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్



ఆదివాసీ సంఘం నాయకులతో కలిసి పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు



ఆదివాసీ న్యాయవాది పాయం రవివర్మను సన్మానిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పాటించడంలో ఆదివాసీలకు ప్రపంచస్థాయిలో ప్రత్యేక స్థానం ఉందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ సెంటర్‌లో మన్యం వీరుల విగ్రహాలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి బ్రిడ్జి సెంటరు వరకు భారీ ర్యాలీని నిర్వహించగా.. గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సందడిగా సాగింది. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గిరిజన యువతి యువకులకు వివిధ రంగాల్లో శిక్షణ అందించి వారికి స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందడానికి సౌకర్యాలు కల్పిస్తున్నామని, భద్రాచలం నుంచి ఆరుగురు డాక్టర్లు, ఇంజనీర్లు సీట్లు సాధించారని వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు శ్రమించాలన్నారు. అలాగే పోడు వ్యవసాయం చేసుకునే గిరిజన రైతు లకు సబ్సిడీతో వెదురు, మునగ, పామాయిల్ పంటలు వేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. కొండరెడ్ల సంక్షేమానికి పాటుపడుతున్నామని పేర్కొన్నారు.

ఆదివాసీలందరింకి శుభాకాంక్ష కెచ్చనన్

కోయభాషలో మాట్లాడిన ఐటీడీఏ పీవో

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ కోయభాషలో గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఆదివాసీలందరింకి శుభాకాంక్ష కెచ్చనన్' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

గిరిజనులు సేంద్రియ పంటలు సాగు చేసేందుకు తనవంతు ప్రోత్సహిస్తానని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రైతులు పీఎంజల్ జీవన్ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో చేపల చెరువులు, పండ్ల చెట్లు, మునగ చెట్లు, పామాయిల్ తోటలు, చేపల పెంపకం, మేకల పెంపకం వంటి పథకాల ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవాలన్నారు. మిల్లెట్ బిస్కెట్లు ప్రధానమంత్రి నోట మన్‌కీ బాత్‌లో మహిళలను ప్రశంసించడంతో జిల్లా పేరు లండన్ వరకు వెళ్లిందని వారికి నా ప్రత్యేక ధన్యవాదాలన్నారు. క్రీడల్లో గిరిజన విద్యార్థులు మన జిల్లాలోనే అంతర్జాతీయస్థాయిలో రాణించడం గర్వకారణమని క్రికెట్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్‌లో మన గిరిజన పిల్లలే ఉండటం చాలా సంతోషకరమ న్నారు. గిరిజన యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పెసా చట్టం పకడ్బందీగా అమలు చేస్తామని, ఆర్వోఎఫ్ఆర్ ద్వారా ప్రతి పథకం గిరిజనులకే చెందేలా చేస్తామన్నారు.

భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఉద్దీపకం వర్క్‌బుక్ ప్రవేశపెట్టామని విద్యార్థుల విద్యాభ్యాసం జీపీఎస్ పాఠశాలలోనే చదివే పిల్లల్ని కాకుండా వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటామన్నారు. కెరీర్ గైడెన్స్‌ను 141 పాఠశాలల్లో ప్రవేశపెట్టామని, పదో తరగతిలో మన జిల్లా మంచి ఫలితాలు సాధించిందన్నారు. గిరిజన విద్యార్థుల క్రీడలకోసం రూ.25లక్షలతో క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి అందించామని, ఉట్నూరులో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో మన ఐటీడీఏకు ఓవరాల్ చాంపియన్‌షిప్ వచ్చిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో చదివే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నామని ఎంఎస్ ఎంఈ ద్వారా జీవనోపాధి పొందుతున్న గిరిజన మహిళలకు ఆర్థికంగా సహాయం అందిస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజను లకు సేవ చేసే అవకాశం రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని పేరొన్నారు. గిరిజనుల భూ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశం అనంతరం వారు ఆదివాసీ సంఘాల నాయకులు పూనెం కృష్ణదొర, పాయం రవివర్మ, శరత్‌బాబు, మురళీ, రమేష్, పుల్లయ్య, వీరస్వామి, సుధారాణి, అరుణ, ఐటీడీఏ అధికారులు, గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గిరిజన మ్యూజియంకు సంబంధించి టేబుల్‌బుక్ కాపీని ఆవిష్కరించారు. అదేవిధంగా వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన వారిని సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఏవో సున్నం రాంబాబు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్, ఈఈ హరీష్, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

వారిని అన్నిరంగాల్లో అగ్రగామిగా ఉంచడమే మా లక్ష్యం

ఆదివాసీ దినోత్సవంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెంలో భారీ ర్యాలీ

కొత్తగూడెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారిని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలపడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు పోలీసు అధికారులు, ఆదివాసీ నాయకులు, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలీసులు ఆదివాసీలతో మమేకమై నృత్యాలు చేశారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సభలో ఆదివాసుల ఆరాధ్యదైవమైన కొమరం భీం చిత్రపటానికి ఎస్పీ రోహిత్‌రాజ్, ఆయా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదివాసీ జిల్లాగా భద్రాద్రి జిల్లాకు పేరు ఉందని ఇక్కడ నివసించే ఆదివాసీ ప్రజలు అన్నిరంగాల్లో ముందుండేలా ప్రభుత్వం తరఫున పోలీస్‌శాఖ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడమే కాకుండ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శిక్షణ తరగతులను కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. చర్ల మండలంలోని చెన్నాపురం, పూసుగుప్ప సరిహద్దు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో రెండు మొబైల్ ఆస్పత్రులు, దుమ్ముగూడెంలో రూ.2 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను, పూసుగుప్ప నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దు వరకు రెండు కిలోమీటర్ల దూరం రోడ్డును రూ.3 కోట్లతో నిర్మించామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో పోలీసు శాఖ సహకారంతో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వ పునరావాస పాలసీకి ఆకర్షితులై ఈ ఏడాది కాలంలో సుమారు 300 మందికి పైగా మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారన్నారు.



ప్రతిభ కనబర్చిన ఆదివాసీలను సత్కరించిన ఎస్పీ రోహిత్ రాజు

అనంతరం విద్య, ఉద్యోగాల్లో ప్రతిభ కనబర్చిన ఆదివాసీలను సత్కరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కొత్తగూడెం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

రామాలయంలో హయగ్రీవ స్వామి జయంతి



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శనివారం హయగ్రీవ స్వామివారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు అర్చకులు విశేష అర్చన నిర్వహించారు.

సింగరేణి హక్కుల సాధనకు ఉద్యమిస్తాం..

ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు రజాక్



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు రజాక్

రుద్రంపూర్, (సింగరేణి) ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ తెలిపారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్మికులు జీఎం కార్యాలయానికి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని పలు డిపార్టుమెంట్లలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని అందుకోసం ఐఎన్‌టీయూసీ దశల వారీ ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపు కుమారస్వామి, విప్లవరెడ్డి, భీముడు, పోశం శ్రీనివాస్, భరత్, సీతారామరాజు, వసంత్‌కుమార్, లక్ష్మణ్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాఖీ కట్టేందుకు వచ్చి..

పుట్టింటి వద్దే గుండెపోటుతో మహిళ మృతి

చిన్న అన్నకు రక్ష కడుతూ కుప్పకూలిన వైనం

ఖమ్మం జిల్లా ఆత్కూరులో ఘటన..

స్వగ్రామం కలకోడిమలో విషాదం



హుస్సేన్‌బీ (ఫైల్)

మధిర రూరల్/తల్లాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నయ్యలకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి వచ్చిన వచ్చి చెల్లి గుండెపోటుతో మృతిచెందిన విషాద సంఘటన ఖమ్మం జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. దీంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనకు సంబంధించిన వివరాలివీ.. మధిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ(52) తన ఇద్దరు అన్నలకు రాఖీ కట్టేందుకు శనివారం తన పుట్టినిల్లయిన తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి వెళ్లింది. శనివారం సాయంత్రం తొలుత పెద్దన్నయ్యకు రాఖీ కట్టి.. ఆ పక్క ఇంట్లోనే ఉండే చిన్న అన్న దగ్గరకు వెళ్లింది. ఆయనకు రాఖీ కట్టే సమయంలో గుండెపోటు రావడంతో హుస్సేన్‌బీ కుప్పకూలిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న హుస్సేన్‌బీని సోదరులు, కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. సోదరులకు రాఖీ కట్టేందుకు సంతోషంగా పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డ పండుగ రోజున తమ ఇంట్లోనే కుప్పకూలడంతో సోదరులు, వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. హుస్సేన్‌బి మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన ఆత్కూరు గ్రామానికి తరలించారు.

నాటకం.. తల్లి లాంటిది

- నెలనెలా వెన్నెల ఇలాగే విరాజిల్లాలి
- ఖమ్మం నాకు ఎంతో ఇష్టమైన ప్రాంతం
- ప్రముఖ రచయిత, సినీ నటుడు తనికెళ్ల భరణి, సినీ దర్శకుడు దశరథ్
- మూడో రోజూ అట్టహాసంగా తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు



ఐ హేట్ ఇండియా నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నాటకం తల్లి లాంటిదని, అలాంటి నాటకాన్ని బతికిస్తున్న నెలనెలా వెన్నెల ఇలాగే విరాజిల్లాలని ప్రముఖ రచయిత, సినీ నటుడు తనికెళ్ల భరణి ఆకాంక్షించారు. నెల నెలా వెన్నెల 8వ వార్షిక సంబురాల్లో భాగంగా ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరుగుతున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో మూడో రోజైన శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఖమ్మం అంటే తనకు ఎంతో ఇష్టమని, ఈ ప్రాంతం, నాటకాలు వేసే ఈ వేదికతో తనకెంతో అనుబంధం ఉందని ఆయన గుర్తుచేసుకున్నారు. సినీ దర్శకుడు దశరథ్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లా పేరును దశదిశలా చాటుతూ నెలనెలా వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మూడు సంస్థల బాధ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ నీరజ హాజరై ప్రాచీన కళలను బ్రతికిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడ వారు ప్రదర్శించిన ఐ హేట్ ఇండియా, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు ప్రదర్శించిన విడాకులు కావాలి, మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన ఇది రహదారికాదు నాటికలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, కొత్తూరు దేవేంద్ర, చీఫ్ ప్యాట్రన్స్ నాగబత్తిని రవి, కురువెళ్ల ప్రవీణ్, వేల్పుల విజేత, వేముల సదానంద్ పాల్గొన్నారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్ట్స్), ఖమ్మం కళా పరిషత్, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నాటిక పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి.

ప్రభుత్వ భవనాలపై 'సోలార్'

(5వ పేజీ తరువాయి)

భూములను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఖమ్మం కలెక్టరేట్‌లో పార్కింగ్ షెడ్లు సోలార్ ప్యానెళ్లతో నిర్మించినట్లు తెలిపారు. ఆదేశాల మేరకు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇరిగేషన్ భూములు, దేవాదాయ భూముల వివరాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఏడీఈ కమర్షియల్ నాగమల్లేశ్వరరావు, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్దీత నమూనాల్లో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యూరియా కోసం రైతుల ధర్నా



చెన్నూరులో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కల్లూరు మండల పరిధిలోని చెన్నూరులో ప్రధాన రహదారిపై శనివారం యూరియా కోసం రైతులు తెలంగాణ రైతు సంఘం తరుపున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీల ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లో చాలీచాలని యూరియాను ప్రభుత్వం సరఫరా చేయటంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియాను అందించక పోవటంతో చెన్నూరు సొసైటీ పరిధిలో గల చంద్రుపట్ల, ఖైబీపల్లి, వాచ్యానాయక్ తండా, లింగాల, రఘునాథగూడెం గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రైతులు సొసైటీ కార్యాలయం వద్ద కూపన్ల కోసం పడిగాపులు పడ్డారు. యూరియా పంపిణీ జరుగుతుందన్న సమాచారంతో ఒకేసారి రైతులు రావటంతో తోపులాట జరిగింది. దీంతో సమాచారం అందుకున్న కల్లూరు ఎస్ఐ హరిత తన సిబ్బందితో సదరు కార్యాలయం వద్ద చేరుకున్నారు. అదే సమయంలో ఏవో రూప దగ్గర ఉండి సొసైటీలో నిల్వ ఉన్న యూరియాను రైతులకు కూపన్ల ద్వారా అందేలా చేశారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందిస్తామని వ్యవసాయ అధికారి రూప హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళనను విరమించారు.

పంపిణీలో ఆంక్షలు ఎత్తివేయాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండు

సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తి వేయాలని కల్లూరు మండల తెలంగాణ రైతు సంఘం నాయకుడు మాదాల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. రైతులకు యూరియా అందించే విషయంలో పాస్‌పుస్తకం, ఆధార్, గుర్తింపుకార్డు జిరాక్స్‌లు మినహాయింపు ఇవ్వాలని, కౌలు రైతులకు యూరియా సరఫరా చేయాలని ఆయన ఈ సందర్భంగా ధర్నాలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెలకు ఒకసారి యూరియా అందించడం ప్రభుత్వానికి సరికాదన్నారు. పంట పొలాలు వదిలి యూరియా కోసం క్యూలో నిలబడే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రావూరి వెంకటేశ్వరరావు, ఆళ్ల శ్రీకాంత్, దంతాల లక్ష్మయ్య, నల్లమాటి రామకృష్ణ, మాదాల భద్రయ్య, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల కల.. తీరనున్న వేళ

(5వ పేజీ తరువాయి)

మొత్తం జోన్ 2లో ఉండగా.. ఈ రెండు మండలాల భూములు జోన్3లో ఉండటంతో రైతులు ఏళ్లుగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

మరుగున పడిన నాటి ప్రతిపాదన..

రాష్ట్ర విభజన ఖాయమనుకున్న సందర్భంలో సాగునీటి ప్రమాదాన్ని ముందే గ్రహించిన భట్టి విక్రమార్క నాడు ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ మండలాల్లోని ఆయకట్టును జోన్3 నుంచి జోన్ 2కు మార్చేందుకు డిప్యూటీ స్పీకర్ హోదాలో.. స్థానిక శాసనసభ్యుడిగా ప్రయత్నం చేశారు. కానీ రాష్ట్ర విభజన తర్వాత దశాబ్ద కాలంగా ఈ ప్రతిపాదన మరుగున పడింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత భట్టి మధిర నియోజకవర్గంలోని జోన్ 3లో ఉన్న సాగర్ ఆయకట్టును జోన్ 2లోకి మార్చాలంటూ అటు శాసనసభలోనూ, బయట ఇదే అంశాన్ని లేవనెత్తినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి భట్టి ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే భారీ నీటి పారుదలశాఖ మంత్రిని మధిరకు తీసుకొచ్చి జోన్ 3లో ఉన్న సాగర్ ఆయకట్టును జోన్ 2లోకి మారుస్తున్నట్లు ఏడాది క్రితం ప్రకటన చేయించారు. వెంటనే ఈ పథకానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అంచనాలు పూర్తి చేయించగా.. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయి.. ఆదివారం శంకుస్థాపనకు సిద్ధమైంది.

నికర జలాల తరలింపు..

జోన్ 3లో ఆయకట్టుకు మధిర, ఎర్రుపాలెం మండలాలకు కేటాయించిన నికర జలాలను తల్లాడ మండలం రెడ్డిగూడెం సమీపంలో సాగర్ మెయిన్ కెనాల్ (21 ఎంబీసీ) 51.70 కిలోమీటర్ నుంచి 500 క్యూసెక్కులు తీసుకుని ఈ నీటిని వైరా నదిలోకి మళ్లించి, ఆ నీటిని మధిర మండలం వంగవీడు వద్ద చెక్‌డ్యాం తరహా మినీ రిజర్వాయర్, పంప్‌హౌస్‌లు నిర్మించి ఎత్తిపోతల పథకం ద్వారా మధిర మండలంలోని నాగవరప్పాడు వద్ద పైప్‌లైన్ ద్వారా నిదానపురం మేజర్ సాగర్ కాలువలోకి నీటిని ఎత్తిపోయనున్నారు. అక్కడి నుంచి కాలువల ద్వారా కట్టలేరులోకి నీళ్లు మళ్లించి అయ్యవారిగూడెం వద్ద రెండు పంప్‌హౌస్‌లు నిర్మించి పైప్‌లైన్ ద్వారా మైలవరం బ్రాంచ్ కెనాల్‌కు, మరో పైప్‌లైన్ ద్వారా గుంటుపల్లిగోపారం వద్ద జమలాపురం బ్రాంచ్ కెనాల్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ఈ జవహర్ ఎత్తిపోతల పథకం ద్వారా మధిర మండలంలోని 13 వేల ఎకరాలు, ఎర్రుపాలెం మండలంలోని 20 వేల ఎకరాల సాగర్ ఆయకట్టును స్థిరీకరించనున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తయి కాలువలు తవ్వి ఐదు దశాబ్దాలు గడిచిన తరువాత కానీ మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని రైతులు వానాకాలంలోనే సాగుకు సిద్ధమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

అక్రమాలు నిగ్గుతేలేదెన్నడు?

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగ విరమణల తర్వాత వచ్చే బెనిఫిట్ల కోసం అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది. వారంతా నిందారోపణల నుంచి బయటపడేందుకు మధ్యవర్తుల ద్వారా రాజీ యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

క్రెడిట్ సొసైటీలో అక్రమాలు ఎలా జరిగాయంటే...

1987లో ఇల్లెందులోని 21 ఇంక్లైన్ భూగర్భగని వేదికగా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పడింది. చాలా కాలం పాటు కార్యకలాపాలు సజావుగానే సాగినట్లు కనిపించినా.. సొసైటీలో పెద్దఎత్తున ఆర్థిక అక్రమాలు జరగడం గమనార్హం. సుమారు రూ.కోటికి పైగా కుంభకోణం జరిగినట్లు వెలుగులోకి రాగా.. సహకార శాఖ అధికారులు సుమోటోగా తీసుకుని విచారణ ప్రారంభించారు. ట్రిబ్యునల్‌లో జరిగిన విచారణల్లో రూ.20లక్షలకు పైగా అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. నిజానికి కొందరు సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేయకుండానే పరపతి కలిగిన కొందరు కార్మిక నాయకులకు డిపాజిట్లు చేసినట్లు బాండ్లు జారీ చేయడం, మెచ్యూరిటీ డబ్బులు కూడా చెల్లించడం, తక్కువ మొత్తాలు డిపాజిట్ చేసి ట్యాంపరింగ్‌ల ద్వారా ఎక్కువ మొత్తాలు నమోదు చేశారన్న ఆరోపణలు గతంలో వచ్చిన విషయం తెలిసిందే. అయితే విచారణలో డిపాజిట్లు చేసినట్లుగా రశీదులు సృష్టించారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. సొసైటీ ఆర్థిక లావాదేవీలపై సహకార శాఖ ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది. ఆ ఆడిట్ అధికారులను వివిధ రూపాల్లో పక్కదోవ పట్టించి అంతా సవ్యంగానే ఉన్నట్లు ధ్రువీకరించుకుంటూ లోపాలు బయటపడకుండా తమ అక్రమాలను సాగించారు.

వెలుగులోకి ఆసక్తికర విషయాలు..

ఈ క్రమంలో 2014లో కుంభకోణం వెలుగు చూడటంతో అనేక ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఒక కార్మిక నాయకుడు చేసిన డిపాజిట్‌కు రెండు పర్యాయాలు మెచ్యూరిటీ డబ్బులు తీసుకున్నట్లు ప్రచారం సాగింది. కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా ఉన్న సొసైటీ ఆర్థిక లావాదేవీలు పర్యవేక్షించిన ఒక జనరల్ మజ్దూర్ కార్మికుడిని ఉద్యోగ విరమణ పొందిన పిదప కూడా కొనసాగించడం అక్రమాల వెనుక ఉన్న డైరక్టర్లకే చెల్లింది. కుంభకోణం వెల్లడికావడంతో ఆయనతో పాటు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో భారీ మొత్తాల డిపాజిట్లను గుర్తించారు. సదరు సూత్రధారి బినామీ పేర్లతో పెద్దమొత్తాల్లో రుణాలు కూడా తీసుకున్నట్లు బట్టబయలైంది. విచారణ కాలంలో ఆయన చనిపోయాడు. కాగా అక్రమాలకు పాల్పడిన వారిని విడిచి సొసైటీకి ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్న మైన్ అధికారులను బాధ్యులుగా నిర్ధారించడం, వారిపై అటు సింగరేణి యాజమాన్యం, ఇటు సహకార శాఖ అధికారులు చర్యలకు దిగడం చర్చనీయాంశమైంది. నిజానికి విచారణలో వెల్లడైన అంశాలపై అక్రమాలకు కారకులైన వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా విచారణ అధికారులు అక్రమార్కులను కాపాడారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. గతంలో మంద్యామర్రి, బెల్లంపల్లి ఏరియాల్లోని సింగరేణి క్రెడిట్ సొసైటీల్లో అవకతవకలు జరిగినప్పుడు బాధ్యుల నుంచి సొమ్మును రికవరీ చేసి సొసైటీ కార్యవర్గాలను బాధ్యులుగా నమోదు చేశారు. కానీ ఇల్లెందు 21ఇంక్లైన్‌లో అందుకు భిన్నంగా అక్రమాలకు పాల్పడిన డైరక్టర్లను విడిచి అమాయకులైన కొందరు అధికారులపైనే కేసులు నమోదు చేశారన్న ప్రచారం జరుగుతోంది. నిజానికి ఎక్స్ అఫిషియో సభ్యులు సొసైటీ వ్యవహారాల్లో నిమిత్త మాత్రులుగానే ఉంటారు. తమ బొగ్గు గని విధులు నిర్వహిస్తూనే సొసైటీ తీర్మానాల మేరకు చెక్ పవర్లు కలిగిన అధికారులు కార్మికులకు రుణాలు, డిపాజిట్ల చెక్కులు జారీ చేస్తారు. అయితే అక్రమాలు జరిగిన కాలంలో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉన్న అధికారులనే బలి పశువులుగా చేశారన్న ఆరోపణలు వెల్లుబుకుతున్నారు. ఈ క్రమంలో తాము ఎలాంటి తప్పులు చేయలేదని, తమపై ఎందుకు చర్యలు తీసుకుంటున్నారని, ప్రమోషన్లు ఎందుకు నిలిపివేస్తున్నారని గగ్గోలు పెట్టినా పట్టించుకునే వారే కరువయ్యారని బాధితులు తెలిపారు. చేయని నేరానికి తాము శిక్ష అనుభవిస్తున్నామని వాపోతున్నారు.

చేయని తప్పునకు మాకెందుకు శిక్ష..

సొసైటీలో జరిగిన కుంభకోణంలో రికార్డులు లావాదేవీలు నిర్వహించిన క్లర్క్ కేంద్రంగా అనేక అక్రమాలు జరిగినట్లు వెల్లడైనప్పటికీ అధికారులను బాధ్యులు చేయడం సమంజసం కాదని తాము చేయని తప్పుకు ఎందుకు డబ్బులు చెల్లించాలని బాధిత అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల్లో కొందరికి ప్రమోషన్లు నిలిచిపోవడం, రిటైర్డైన ఒక మేనేజర్‌కు గ్రాట్యుటీ చెల్లింపులు నిలిపివేయడం లాంటి చర్యలకు సింగరేణి యాజమాన్యం పూనుకోవడం తాము ఆర్థికంగా మానసికంగా కష్టనష్టాలకు గురవుతున్నామన్నారు. ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా సహకార శాఖ అధికారులు సమగ్ర విచారణ జరపాలని అక్రమాలకు పాల్పడిన వారి నుంచి డబ్బులు వసూలు చేసి డిపాజిట్ దారులకు చెల్లించకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వ్యవహరించి అదనపు భారాలతో ఉద్యోగ విధులు సొసైటీ విధులు నిర్వహిస్తూ కార్మికులకు సేవలందించిన తమను బలిపశువులు చేస్తూ తమ నుంచి డబ్బులు ఎలా రికవరీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఫలితంగా సింగరేణి 21 ఇంక్లైన్ క్రెడిట్ సొసైటీ అక్రమాల నిగ్గు తేల్చి కార్మిక డిపాజిట్ సొమ్ము చెల్లించాలని తాజా మాజీ కార్మికులు కోరుతున్నారు.

రాజీ యత్నాల్లో సహకార శాఖ అధికారులు..

ట్రిబ్యునల్ గతేడాది జారీ చేసిన ఆదేశాల మేరకు డిపాజిట్ దారులకు డబ్బులు చెల్లించేందుకు సహకార శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న సింగరేణి అధికారుల నుంచి డిపాజిట్ల సొమ్ముగా రూ.17,43,140 వాటిపై వడ్డీగా రూ.22,79,948 మొత్తం రూ.40,23,088 వసూళ్లు చేసేందుకు యత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 5న జిల్లా సహకార శాఖ విచారణ అధికారి ఇల్లెందుకు వచ్చి క్రెడిట్ సొసైటీ జారీ చేసిన డిపాజిట్ దారుల బాండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా 70మంది తాజా మాజీ కార్మికులు తమ వద్దనున్న బాండ్లను సమర్పించారు. రాజీ మార్గంలో రికవరీ సొమ్మును వసూలు చేసి దామాషా పద్ధతిలో డిపాజిట్ దారులకు అందజేస్తామని సహకార అధికారులు చెబుతున్నట్లు సమాచారం.

'క్విట్ ఇండియా'లో కాంగ్రెస్‌ది కీలకపాత్ర

» డీసీసీ కార్యాలయంలో జెండావిష్కరణ చేసిన జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల, నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో క్విట్ ఇండియా ఉద్యమం ఎంతో కీలక పాత్ర పోషించిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. జాతీయజెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ క్విట్ ఇండియా ఉద్యమంపై మాట్లాడారు. స్వతంత్ర భారత కోసం బ్రిటిష్ పాలనను అంతం చేయాలని ఆగస్టు 8న మహాత్మాగాంధీ బొంబాయిలో జరిగిన సమావేశంలో క్విట్ ఇండియా పిలుపునిచ్చారని తెలిపారు. భారతదేశం నుంచి బ్రిటిష్ వారు భేషరతుగా విడిచి వెళ్లాలని దేశ ప్రజలు ముక్త కంఠంతో పిలుపునిచ్చారని వివరించారు. ఉద్యమాన్ని నీరుగార్చేందుకు జాతీయ కాంగ్రెస్ నాయకులను జైలుకు పంపారన్నారు. ఎందరో వీరులు తమ ప్రాణాలను కోల్పోయరాన్నరు. నేటి ప్రతి పౌరుడు క్విట్ ఇండియాను స్ఫూర్తిగా తీసుకొని దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, కాంగ్రెస్ అనుబంధ జిల్లా అధ్యక్షుడు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్ గౌడ్, ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, గజ్జల వెంకన్న, లకావత్ సైదులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లే తోబుట్టువులుగా..

» రాఖీలు కట్టిన ఆదివాసీ మహిళలు

పెనుబల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చెట్లు, చేమలే తోడుగా నిత్యం అడవిలో పనులు చేసుకుంటూ జీవించే అడవి తల్లి బిడ్డలు.. ఆదివాసీ మహిళలు రాఖీపండుగ సందర్భంగా శనివారం అడవిలో చెట్లకు రాఖీలు కట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ ఏడాది ప్రపంచ ఆదివాసీ దినోత్సవంతోపాటు రక్షాబంధన్ పండుగ ఒకేరోజు రావడంతో ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని బ్రహ్మళకుంట గ్రామానికి చెందిన గిరిజన మహిళలు తమ గ్రామానికి సమీపంలోని అడవికి వెళ్లి చెట్లకు రాఖీలు కట్టారు. అడవిలో చెట్లు తమ తోబుట్టువులంటూ వాటికి ఎలాంటి హాని జరుగకూడదంటూ పసుపు, కుంకుమ సమర్పించారు. చెట్లు, పశుపక్షాదులు, జంతువులు క్షేమంగా ఉండాలని... అప్పుడే తమ బతుకులు సక్రమంగా సాగుతాయని ఆ మహిళలు అంటున్నారు. అడవిలోని చెట్లను అక్రమంగా నరికేసేవారు.. చెట్టుకు తాము కట్టిన రాఖీని చూసైనా గొడ్డలివేటు వేయకుండా ఆపుతారని భావిస్తున్నామని చెబుతున్నారు. ఆదివాసీ మహిళలు చేస్తున్న కార్యక్రమాన్ని చూసి అటవీశాఖ డీఆర్‌వో సురేష్, బీట్ ఆఫీసర్ కాశా, సిబ్బంది రాములు ఆదివాసీ మహిళలను అభినందించారు.



అడవిలో చెట్లకు రాఖీలు కడుతున్న మహిళలు

పొంగులేటి, మువ్వాకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): శనివారం సత్తుపల్లి పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబుకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆమె వారికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలపగా.. ఆమె వెంట కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఉన్నారు.

సుకుమాలో జవాన్ల విగ్రహాలకు రాఖీలు కట్టిన తోబుట్టువులు

చర్ల: పోలీసు జవాన్ల విగ్రహాలకు వారి ఆడపడుచులు రాఖీలు కట్టిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎర్రబోరు గ్రామంలో శనివారం జరిగింది. సుకుమా జిల్లా ఎర్రబోరు గ్రామంలో పదేళ్ల క్రితం మావోయిస్టులు, బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. వీరి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు గ్రామ నడిబొడ్డున మూడు విగ్రహాలను ఏర్పాటు చేశారు. శనివారం రాఖీపండుగ సందర్భంగా మృతి చెందిన జవాన్ల అక్క, చెల్లెళ్లు రాఖీలు కట్టారు. ఈ దృశ్యాలు పలువురిని కలిచివేశాయి. ఇదే క్రమంలో రాఖీలు కడుతూ ఆడపడుచులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రతీ ఏడాది ఇలాగే తమ సోదరుల విగ్రహాలకు రాఖీలు కడుతామని వారు తెలిపారు.



పొంగులేటి, మువ్వాకు రాఖీలు కడుతున్న ఎమ్మెల్యే రాగమయి



సోదరుల విగ్రహాలకు రాఖీలు కడుతున్న ఆడపడుచులు



ఖమ్మం కమిషనర్ అభిషేక్ అగస్త్యకు రాఖీ కడుతున్న సోదరి

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

» జిల్లాలో అర్హత ఉన్న రైతులు 2,09,387

» 13లోపు దరఖాస్తు చేసుకోవాలి

» ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న రైతులకు రైతుబీమా ఎన్‌రోల్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. పుల్లయ్య తెలిపారు. జూన్ 5 వరకు భూ భారతి పోర్టల్ ద్వారా ధృవీకరించి కొత్త పాసు పుస్తకాలు పొందిన రైతులు తమ పేర్లను రైతుబీమాలో ఎన్‌రోల్ చేసుకోవాలని కోరారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధార్ పోర్టల్‌లో 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న రైతులు ఈ బీమాను సద్వినియోగించుకోవాలన్నారు. రైతుబీమా పోర్టల్ శనివారం నుంచి అందుబాటులోకి వచ్చిందని ఈనెల 13లోగా కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు ఏఈవోలకు దరఖాస్తులను అందించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో కొత్తగా పాసుపుస్తకాలు పొందిన వారు 10,494, ఐదెకరాల లోపు పాత పుస్తకాలు ఉన్నవారు 2,992, రెన్యువల్ చేయించుకునే రైతులు 1,95,596, ఐదెకరాలు పైబడిన పాత పట్టాదారులు 305 మంది ఉన్నారని మొత్తం 2,09,387 మంది రైతులున్నట్లు ఆయన తెలిపారు. రైతులు ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈవోల వద్దకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు అందించాలని డీఏవో పుల్లయ్య కోరారు.

పల్లె రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

» కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సుజాతనగర్, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ముమ్మరంగా రహదారుల నిర్మాణాలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అనతికాలంలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలో నాన్యాతండా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, సొసైటీ ఛైర్మన్ మండే వీర హనుమంతరావు, గ్రంథాలయ ఛైర్మన్ పసుపులేటి వీరబాబు, భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, మూడు గణేష్, కొమారి కృష్ణ, అనిల్, ఊకే నాగేశ్వరరావు, సక్రాం, దండు సురేష్, కొమరయ్య, ఆకుల వెంకన్న, సీఐ రాయల వెంటేశ్వరరావు, ఎస్ఐ ఎం.రమాదేవి, పాల్గొన్నారు.

ఏడాదిగా ఇలా.. ప్రయాణికుల అవస్థలు తీరేదెలా?

» అసంపూర్తిగా మధిర, జగ్గయ్యపేట రోడ్డు

» భట్టి విక్రమార్క ఆదేశాలూ బేఖాతరు

వైరా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం ఏడాదికాలం దాటినా అసంపూర్తిగానే మిగిలి ఉంది. ఈ మండలానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని భట్టి విక్రమార్క ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించినప్పటికీ వారు ఏమాత్రం ఖాతర్ చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రూ.12కోట్లతో గత ఏడాది ఏప్రిల్ నెలలో ఈ రోడ్డు నిర్మాణం మొదలైంది. అయితే ఇంతవరకు ఇది అతీగతీ లేదు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న క్రాస్‌రోడ్డు నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన వరకు రెండువరుసల రోడ్డును నాలుగు వరుసలరోడ్డుగా నిర్మించేందుకు పనులు మొదలు పెట్టారు. దాదాపు రెండున్నర కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 700మీటర్ల దూరం మాత్రమే కేవలం రెండు వరుసల బీటీ రోడ్డును నిర్మించారు. ఇదే దూరంలో మరో రెండు వరుసల వెట్‌మిక్స్ నిర్మాణం చేశారు. బీటీ నిర్మించలేదు. ఇక మిగిలిన రోడ్డు నిర్మాణం అతీగతీ లేదు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం ఊసే లేదు. బిల్లుల జాప్యం కారణంగా ఈ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందనే విషయం తన దృష్టికి వచ్చిన తర్వాత భట్టి విక్రమార్క చేసిన పనుల వరకు బిల్లులు కూడా విడుదల చేశారని సమాచారం. బిల్లులు చెల్లించి మూడునెలలు దాటినప్పటికీ ఈ రోడ్డు నిర్మాణ పురోగతి మాత్రం లేదు. ఓ వైపున గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం శరవేగంగా జరుగుతుండగా కేవలం రెండున్నర కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం మాత్రం నత్తనడకను తలపిస్తుంది. ప్రతినెలా మూడ్నాలుగుసార్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇదే రోడ్డు నుంచి రాకపోకలు కొనసాగుతున్నారు. తన నియోజకవర్గమైన మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే ఎంతో కీలకంగా ఉంది. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణ విషయంలో భట్టి విక్రమార్క కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న వైరాలోని మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం

మోటార్ల దొంగల అరెస్ట్

» 13చోట్ల దొంగతనాలు

» 2.58 క్వింటాళ్ల కాపర్ వైరు, కారు, బైక్ స్వాధీనం

» సింగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగిషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లూ చోరీ

పినపాక, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): సింగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగిషన్ విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసును ఏడూళ్లబయ్యారం పోలీసులు చేధించారు. శనివారం ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. మండలంలోని సింగిరెడ్డిపల్లి గ్రామంలోని లిఫ్ట్ విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఈనెల 3న ఆదివారం రాత్రి చోరీ చేశారు. దీనిపై స్థానిక ఆయకట్టు రైతులు సంబంధిత విద్యుత్, ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన అధికార్లు, దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని ఏడూళ్లబయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 5న ఫిర్యాదు చేశారు. నిఘా పెట్టిన పోలీసులు శుక్రవారం సాయంత్రం ఉప్పాక క్రాస్‌రోడ్‌లోని బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అటుగా వచ్చిన ఓ కారు, స్కూటీ పోలీసులను గమనించి తిరిగి వెళుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా పాల్వంచకు చెందిన కెల్లా దుర్గాప్రసాద్, మంత్రి దుర్గాప్రసాద్, చింతపల్లి శివ, గనగళ్ల గణేష్, కోరగట్టు నాగరాజు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. 13చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ఇందులో దమ్మపేటలో 5, బూర్గంపాడులో 2, అశ్వాపురంలో 1, మణుగూరులో 1, పస్రాలో1, మంగపేటలో 1, ఏడూళ్ల బయ్యారంలో2 చోట్ల దొంగతనాలు చేశారు. వీరినుంచి 2.58క్వింటాళ్ల కాపర్ తీగను స్వాధీనం చేసుకున్నారు. వాటివిలువ సుమారు రూ.4 లక్షలు వరకు ఉంటుందని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు పాల్గొన్నారు.

30 లక్షల పైనే..

సింగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌తో సాగునీరందించేందుకు ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లను తిరిగి అసెంబ్లింగ్ చేయాలంటే దాదాపు రూ.30లక్షలపైగా ఖర్చవుతుందని ఇరిగేషన్‌శాఖ అధికారులు, విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో వినియోగించిన కాపర్, ఆయిల్ మార్కెట్‌లో చాలా ఖరీదు ఉంటాయని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా మరమ్మత్తులు చేసి, సాగు నీరందించేందుకు



పట్టుబడ్డ వాహనాలు, కాపర్ వైరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఖమ్మంలో దొంగల హల్‌చల్

రోడ్లపై తిరుగుతున్న వీడియోలు వైరల్



సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన దొంగల చిత్రాలు

ఖమ్మంక్రైం, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): దొంగలు ఖమ్మం నగర శివారులోని ఓ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. నగరంలోని ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గొల్లగూడెం సమీపంలోని ఓ కాలనీలో ముగ్గురు ముఖానికి మాస్కులు పెట్టుకొని, చేతిలో రాడ్లు పట్టుకొని రోడ్లపై వెళ్లారు. ఆ కాలనీలోని ఓ ఇంట్లో యజమాని కుటుంబ సభ్యులతో ఊరు వెళ్లటంతో తాళాలు పగలుగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఏమీ దొరకపోవటంతో అక్కడి నుంచి గోడలు దూకి వెళ్లిపోయారు. ఈ దృశ్యాలు కాలనీలోని సీసీ కెమెరాల్లో సైతం రికార్డు అయ్యాయి. ఈ వీడియోలు శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సదరు వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ భాను ప్రకాష్ తెలిపారు. పెట్రోలింగ్ పెంచినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో 10 మంది అరెస్టు

చింతకాని,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి నారపోగు రామకృష్ణపై జరిగిన హత్యాయత్నం ఘటనకు పాల్పడిన 12 మంది నిందితులలో 10 మందిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మణుగూరు డిపోలో ఆర్టీసీ విజిలెన్స్ అధికారుల విచారణ

మణుగూరుటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మణుగూరు డిపోలో శుక్రవారం కార్మికుల ఆందోళనపై శనివారం ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. శనివారం డిపోకు చేరుకున్న విజిలెన్స్ అధికారులు సిబ్బందిని వేర్వేరుగా విచారించారు. డిపోమేనేజర్ శ్యాంసుందర్ పై వస్తున్న ఆరోపణలపై కూడా అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.ఈవిచారణలో మేనేజర్‌కు వ్యతిరేఖంగా అనేక ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఆర్టీసీలో ఉన్న బస్సుల పనితీరుపై కూడా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు వివరాలు తెలుసుకున్నారు. డీఎం, ఏఎంఎఫ్‌ల పర్యవేక్షణ కరువైందని సిబ్బంది వివరించారు. మహిళా సిబ్బందిపై కూడా డీఎం దురుసుగా ప్రవర్తిస్తున్నాడని చెప్పినట్లు సమాచారం.

తప్పిన ప్రమాదం

» టైర్లు ఊడిపోయి కుప్పకూలిన పల్లెవెలుగు

» ప్రయాణికులు సురక్షితం



అశ్వాపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మణగూరు డిపోనకు చెందిన పల్లెవెలుగు బస్సుకు శనివారం పెనుప్రమాదం తప్పింది. ప్రయాణంలో ఉండగా వెనుకటైర్లు ఒక్కసారిగా ఊడి పోయాయి. దీంతో బస్సు ప్రదాన రహదారిపైనే కుప్పకూలింది. ఈ సంఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. భద్రాచలం నుంచి ప్రయాణికులతో మణుగూరు వెళ్తున్న పల్లెవెలుగు బస్సు మండల పరిధిలోని మిట్టగూడెం వద్ద ఒక్కసారిగా కుడివైపు వెనుకటైర్లు ఊడిపోయాయి. డ్రైవర్ చాకచక్యంతో బస్సును ప్రధాన రహదారిపైనే నిలిపివేశాడు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా బస్సు టైర్లు ఊడిపోయి రహదారిపై ప్రయాణిస్తున్న స్కూటీకి తగలటంతో స్కూటీ కిందపడింది. స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్‌కు గంటకుపైగా అంతరాయం ఏర్పడింది.

ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను సందర్శించిన సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం సందర్శించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్వాహణ పరిశీలించేందుకు తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను తనిఖీచేసి, ట్రాఫిక్ నిర్వాహణలో ఉన్న సవాళ్లను, అవకాశాలను చర్చించారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ నిర్వాహణను మెరుగుపరచడానికి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి కృషిచేయాలని, ఎంఫోర్స్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాల విస్తరణ, ట్రాఫిక్ సమస్య, సంఘటన సమయంలో ప్రతిస్పందన, జరిమానాలు వసూలు, ట్రాఫిక్ పరకరాలపై సమీక్ష జరిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వ్యక్తిగత సంస్థల, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో సరైన పార్కింగ్ స్థలాలు గుర్తించాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. ఇతర ట్రాఫిక్ నిర్వాహణ పద్దతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ సత్యనారాయణ, ఆర్ఐ సాంబశివరావు ఆర్ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.



స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

మణుగూరుటౌన్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి):భద్రాచలం నుంచి మణుగూరు మీదుగా వరంగల్‌కు ఆటోలో తరలిస్తున్న 32 కేజీల గంజాయిని శనివారం మణుగూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని తోగ్గూడెంలో ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమాస్పదంగా ఆటోలో ఇద్దరు వ్యక్తులు కనిపించారు. ఆటోఆపి తనిఖీలు చేయగా 32 కేజీల 15 గంజాయి ప్యాకెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన శ్రీనివాస్ మహబూబాబాద్‌కు చెందిన కుమార్ నిందితులుగా గుర్తించారు. ఎస్ఐ రంజిత్ వారిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.16 లక్షల వరకు ఉంటుందని సీఐ నాగబాబు తెలిపారు.



గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకున్న పోలీసులు

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం: ఏవో

ఖమ్మంరూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అర్హత ఉండి నూతనంగా రైతుబీమా తీసుకోవాల్సిన రైతులు 12లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఉమా నగేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 5వరకు పట్టాదారు పాసుపుస్తకం పొందివారు, గతంలో రైతుబీమా పథకంలో నమోదు కాని రైతులు అర్హులని చెప్పారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, నామీని ఆధార్, తీసుకుని వ్యవసాయాధికారులకు అందజేయాలని సూచించారు. గతంలో రైతు బీమా పథకంలో నమోదు కాబడి నామిని వివరాలను మార్చుకోవాలనుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న బంజారాలు

చదువుతోనే భవిష్యత్తు

- జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయలక్ష్మి
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం



ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ప్రజల భవిష్యత్తు తీర్చిదిద్దేది చదువేని, ప్రతీఒక్కరు చదువుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయలక్ష్మీ అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన భవన్‌లో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. సమాజంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే చదువు ఒకటే మూలమని అన్నారు. చదువు ద్వారా ఎంతటి స్థాయినైన చేరుకోవచ్చని ఆమె తెలిపారు. ఆదివాసీ సంప్రదాయాల ద్వారా నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. ఆర్థికంగా కాకుండా, ఆరోగ్యపరంగా, ప్రకృతిలో మమేకమై సంతోషకరమైన జీవనం గడపడం ఆదివాసీల నుంచి నేర్చుకోవాలన్నారు. ఆదివాసీలు మారుమూల ప్రాంతాల్లో వెనుకబడి ఉన్నారని, విద్యాపరంగా, ఆరోగ్యపరంగా, మౌళిక వసతుల పరంగా సమస్యలు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం నుండి, జిల్లా యంత్రాంగం తరఫున సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. అనంతరం ఆదివాసీల జెండా ఆవిష్కరణ చేశారు. కొమురం భీం, ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఖమ్మంచర్చికాంపౌండ్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి గిరిజన భవనం వరకు బంజార సంప్రదాయ నృత్యాలతో ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బానోత్ కిషన్‌నాయక్, ధరావత్ రామ్మూర్తి, ఎ.రామ్మూర్తి, భిక్షపతి రాథోడ్, మంగ్యానాయక్, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెంలో 313 మందికి పాస్ పుస్తకాలు

రఘునాథపాలెం,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెంమండలంలో ఇటీవల కాలంలో నూతనంగా 313 మంది రైతులు పాస్ పుస్తకాలు పొందారని, వారికి ప్రభుత్వం రైతు బీమాను వర్తింపు చేస్తుందని ఖమ్మం డివిజనల్ వ్యవసాయ అధికారి కొంగర వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రఘునాథపాలెంలో 22, వేపకుంట్లలో 19, రేగులచెలకలో 6, పాపటపల్లిలో 36, ఈర్లపూడిలో 98, వీవీపాలేంలో 23, చింతగుర్తిలో 29, చిమ్మపూడిలో 32, కోయచెలకలో 12, మంచుకొండ 35 మంది రైతులకు పాస్ పుస్తకాలు పొందారని వీరు ఈనెల 13లోపుగా స్థానికంగా ఉన్న ఏవో కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి లేదా ఏఈవోలకు దరఖాస్తు చేయాలన్నారు.

ఆనందోత్సాల మధ్య అనుబంధాల వేడుక







కార్పొరేటర్ రాపర్తి శరత్‌కు రాఖీ కడుతున్న మేయర్ నీరజ, కూసుమంచి కస్తూర్బా పాఠశాలలో, శునకానికి రాఖీ కడుతున్న చిన్నారి

ఖమ్మంరూరల్,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రాఖీ వేడుకలు శనివారం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి సైతం తమ సోదరుడికి రాఖీ కట్టేందుకు వచ్చారు. వరంగల్‌క్రాస్ రోడ్డుకు చెందిన పేర్ల ఆనంద్ శునకాన్ని పెంచుకుంటున్నారు. దానిని రాఖీ ముద్దుగా పిలుచుకుంటారు. అయితే వారి కూతురు పేర్ల లాస్య ఈశునకానికి సోదరభావంతో రాఖీ కట్టింది. నాలుగేళ్లుగా రాఖీ కడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కూసుమంచిలో ఘనంగా రాఖీ వేడుకలు

కూసుమంచి:రాఖీపండుగను కూసుమంచి మండలంలో జరుపుకున్నారు. పండుగ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడంతో బస్సులన్నీ మహిళలతో కిటకిటలాడాయి. ఉదయం ఆరు గంటల నుంచే ఇళ్లలో పండుగ వాతావరణం కనిపించింది. కూసుమంచిలో కస్తూర్బా విద్యాలయంలోనూ, పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలోనూ వేడుకలు జరిగాయి.

రాఖీ పండుగ వేడుకలు

తిరుమలాయపాలెం: రాఖీపండుగ వేడుకలను మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహించారు.కాకరవాయి, బీరోలు, బచ్చోడు, తిరుమలాయపాలెం, పిండిప్రోలు తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

ప్రకృతికి ప్రతిరూపం.. వినాయకచవితి



- మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ వేత్తల పిలుపు
- రూపుదిద్దుకుంటున్న ప్రతిమలు
- 3అడుగుల నుంచి 18 అడుగుల వరకు తయారీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సమీపిస్తోంది. ప్రకృతికి ప్రతిరూపమైన ఈ వినాయక చవితికి మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ వేత్తలు పిలుపునిస్తున్నారు. మట్టి గణపతిని పూజిస్తే.. ప్రకృతిని పూజించినట్టే అని పెద్దలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలోని ఇల్లెందు రోడ్, వైరా రోడ్, హైద్రాబాద్‌రోడ్‌లలో ఈ ఏడాది అధికంగా మట్టితో వినాయకుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. నాయుడుపేట ప్రాంతంలో 3 నుంచి 18అడుగుల మట్టి విగ్రాహాలు తయారవుతుండగా.. ఇక్కడ పదేళ్లుగా మట్టి విగ్రహాలను తయారు చేసుకుంటూ అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నామని విగ్రహ తయారీ దారులు చెబుతున్నారు. అలాగే మిగిలిన ప్రాంతాల్లోనూ మట్టి విగ్రహాలు తయారవుతుండగా.. మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు నిర్ణయించుకున్న మండపాల నిర్వాహకులు ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. దీంతో ఈ ఏడాది మట్టి విగ్రహాలకు డిమాండ్ ఉండనుందని తయారీదారులు పేర్కొంటున్నారు.







భార్య పై భర్త దాడి

ఖమ్మంక్రైం,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త ఇనుప చువ్వతో దాడి చేసిన సంఘటనపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదు అయింది. కామంచికల్‌కు చెందిన చిట్టిబాబును దానవాయిగూడేనికి చెందిన సౌజన్య వివాహం చేసుకుంది. ఈక్రమంలో ఆమె పుట్టింటికి వచ్చింది. శనివారం భార్యను తీసుకెళ్లేందుకు వచ్చిన చిట్టిబాబు ఆమెతో గొడవ పెట్టుకుని ఇనుపచువ్వతో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. సౌజన్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్నేహితుడికి పూర్వవిద్యార్థుల సహాయం

తల్లాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధితో బాధపడుతున్న స్నేహితుడి వైద్యఖర్చులకోసం పూర్వవిద్యార్థులు ఆర్థిక సాయం అదించారు. శనివారం మండలంలోని కుర్నవల్లి గ్రామంలో ఎంఎన్డీ వ్యాధితో బాధపడుతున్న శీలం కృష్ణారెడ్డికి రూ.50వేల ఆర్థిక సహాయం పూర్వవిద్యార్థులు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

- పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జాటోత్ ప్రేమ్‌సింగ్

ఖమ్మంసంక్షేమ విభాగం, రఘునాథపాలెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, అభివృద్ధి, ఆదర్శ సమాజం ఏర్పాటుకు కృషి చేయాలని పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జాటోత్ ప్రేమ్ సింగ్ పేర్కొన్నారు. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం, రఘునాథపాలెం మండలంలో పీవైఎల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గతంలో మహా నగరాలకు పరిమితమైన మత్తుపదార్థాల వినియోగం, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు చేరాయని ఆరోపించారు.గంజాయి,కొకైన్,గుట్కాలను ప్రభుత్వం పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. దీనిపై అవగాహన కల్పించేందుకు రేపు ఖమ్మంలో బైక్‌ర్యాలీ చేపట్టామన్నారు. యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల భరత్, ఇస్లావత్ రమేశ్, దరణ్‌కృష్ణ, మక్కా రవి, ధరావత్ శివలాల్, టీ ఆశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల భరత్

'పాలస్తీనా ర్యాలీ'ని విమర్శించటం సరికాదు

- కాంగ్రెస్,వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులపై అక్కడి ప్రజలకు సంఘీభావంగా ఖమ్మంలో స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహిస్తే బీజేపీ విమర్శిచటం సరికాదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, దండి సురేశ్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు ఖండించారు. శనివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ర్యాలీపై బీజేపీ నాయకులు మాట్లాడటం కేవలం ఉనికి కోసమే అన్నారు. చైతన్యవంతమైన ప్రజలు ఖమ్మంలో ఉన్నారని అమానుష సంఘటనలు ఎక్కడ జరిగినా ఖమ్మం ప్రజలు స్పందిస్తారని, బీజేపీ మాత్రం ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. నాయుకులు కోలా లక్ష్మీనారాయణ, వై విక్రమ్, ఆవుల అశోక్, శింగు నర్సింహారావు, సుభాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

సీపీఎం నాయకుడు కోటయ్య కన్నుమూత

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు దొంగల కోటయ్య(80) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన భౌతిక కాయాన్ని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం సందర్శించి, పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. నాయకులు బండి రమేశ్, బండి పద్మ, వై విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, ఎస్ నవీన్‌రెడ్డి, బొంతు రాంబాబు, భూక్య శ్రీను, బత్తిని ఉపేందర్, నాగుల్‌మీరా నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

సాగర్ కాలువలో మృతదేహం

తమిళనాడువాసిగా గుర్తింపు.. పోలీసులకు అప్పగింత

కూసుమంచి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం నాయకన్‌గూడెం సాగర్ ఇన్‌ఫాల్ కాల్వలో మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జాలర్ల సాయంతో వెలికి తీయించారు. మృతుడు తమిళనాడువాసిగా గుర్తించారు. మృతుడు మిర్యాలగూడెంలోని ఓకంపెనీలో పని చేస్తున్నాడని, మూడు రోజుల క్రితం కాల్వ వద్ద స్నానం చేసేందుకు దిగి కాలుజారి గల్లంతయ్యాడని తెలిసింది. అదేసమయంలో మిర్యాలగూడెం పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు కాల్వ వెంబడి గాలింపు చర్యలు చేపడుతూ వచ్చి, మృతదేహాన్ని గుర్తించడంతో పోలీసులు వారికి అప్పగించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజానీకం

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకోరు కొండి గ్రామంలో మంచి నీటి సరఫరా సక్రమంగా జరగక పోవటంతో శనివారం స్థానిక ప్రజానీకం రోడ్డెక్కి ధర్నా చేశారు. స్థానికంగా రెండు దళిత కాలనీల్లో మూడు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచి పోవడంతో ఇబ్బందుల పడుతున్న ప్రజానీకం అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దకోరుకొండి గ్రామంలో వెన్నవల్లి వెళ్లే రహదారిలో గల గేట్‌వాల్ ఛాంబర్‌ను గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన భారీ వాహనాలు ఢీకొనటంతో పైప్‌లైన్లు పగలటంతో మంచి నీటి సరఫరా నిలిచి పోయిందని స్థానికులు తెలిపారు. గృహఅవసరాలకు నీరు లేక మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన అధికారులు పగిలిన మంచినీటి సరఫరా పైప్ లైన్లను ఆధునీకరణ చేయాలని కోరారు. హైవే ఆథారిటి వారు పగలిన పైప్‌లైన్‌లను బాగు చేయిస్తామని చెప్పడమే కానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించక పోతే ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకోవెళ్తామని హెచ్చరించారు.



ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్రావు

బోనకల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామిలను ప్రభుత్వం నెరవేర్చాలని టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి గోపగాని శంకర్రావు విజ్ఞప్తి చేశారు. బోనకల్‌లో శనివారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. విస్తృతంగా టీజేఎస్ సభ్యత్వ నమోదును చేపట్టి స్థానిక పోరులో సత్తా చాటాలని కోరారు. యూరియ కొరత లేదని మంత్రులు ఒక పక్క చెబుతుండగా, మరోవైపు అధికారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి కూడ ఆర్థిక సాయం ప్రభుత్వం ఇచ్చే విదంగా తమ పార్టీ అధినేత కొందరాం కృషి చేయనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే సంక్షేమపథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం అబినందనీయమన్నారు.

ఇది ఆర్‌అండ్‌బీ రోడ్డేనా?

వైరా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి-చిన్నమునగాల ఆర్‌అండ్‌బీ రోడ్డు అత్యంత అధ్వానంగా ఉంది. మరీ ముఖ్యంగా తాటిపూడి సెంటర్ వద్ద 2నుంచి 3అడుగుల లోతుతో భారీ గుంతలేర్పడ్డాయి. రోడ్డు మొత్తం కుంగిపోయింది. రోడ్డు పక్కన నివాసాల నుంచి వచ్చే మురుగునీరు ఈ గుంతలో చేరి వాగును తలపిస్తోంది. రోడ్డుపై రెండు అడుగుల లోతు గుంతలో మురుగునీరు చేరింది. పాదచారులు ఈ మురుగునీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. వైరా మండలంలోని తాటిపూడి-కొణిజర్ల మండలంలోని చిన్నమునగాలకు ఈ రోడ్డు చాలా కీలకంగా ఉంది. వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఈ రోడ్డు అనుసంధానంగా ఉంది. తాటిపూడి నుంచి చిన్నమునగాల, పెద్దమునగాల, పెద్దగోపతి, చిన్నగోపతి, అమ్మపాలెం మీదుగా తనికెళ్ల జాతీయ ప్రధాన రహదారికి ఈ రోడ్డు కలుస్తుంది. 2016లో తనికెళ్ల నుంచి పెద్దమునగాల వరకు దాదాపు 13కిలోమీటర్ల ఒక వరుస రోడ్డును రెండు వరుసల రోడ్డుగా నిర్మించారు. పెద్దమునగాల నుంచి చిన్నమునగాల మీదుగా తాటిపూడి వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు ఒక వరుసతోనే ఉంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల వారు, వైరా మండలంలోని అనేక గ్రామాల వారు ఈ రోడ్డు గుండానే ఖమ్మానికి రాకపోకలు కొనసాగిస్తున్నారు. చిన్నమునగాల ప్రజలకు ఈ రోడ్డే దిక్కుగా ఉంది. తాటిపూడిలోని అత్యధిక మంది ప్రజలు ఈ రోడ్డునే ఉపయోగించుకుంటున్నారు. అలాంటి ఈరోడ్డు కనీసం పాదచారులు వెళ్లే పరిస్థితి కూడా లేనప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఈ గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్డు మరమ్మతుకు తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరుతున్నారు.



తాటిపూడి-చిన్నమునగాల రోడ్డుపై ఉన్న గుంతల్లో చేరిన మురుగునీరు

ఆంధ్రజ్యోతి

ZONE

ఆదివారం 10 ఆగస్టు 2025

వైరా-మధిర

సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి



పలువురిని పరామర్శించిన పొంగులేటి



విజయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

పెనుబల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో శనివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. వీఎంబంజర్‌లో రిటైర్డ్ సీఐ జన్నారెడ్డి నర్సింహారెడ్డి సతీమణి విజయ ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి పొంగులేటి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్లపెంట గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు మరకాల నర్సోత్తమరెడ్డి సతీమణి నిర్మల ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, చీకటి రామారావు, ఈడా కమలాకర్‌రావు, కేవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

స్నేహితుడికి పూర్వవిద్యార్థుల సహాయం



స్నేహితుడికి ఆర్థికసహాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

తల్లాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధితో బాధపడుతున్న స్నేహితుడి వైద్యఖర్చుల కోసం పూర్వవిద్యార్థులు ఆర్థిక సాయం అదించారు. శనివారం మండలంలోని కుర్నవల్లి గ్రామంలో ఎంఎన్డీ వ్యాధితో బాధపడుతున్న శీలం కృష్ణారెడ్డికి రూ.50వేల ఆర్థిక సహాయం పూర్వవిద్యార్థులు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అయిలూరి ప్రదీప్‌రెడ్డి, కొరకొప్పు రామారావు, దేవరలప్లి నరసింహారావు, శాకంరెడ్డి పుల్లారెడ్డి, నర్సిరెడ్డి, షేక్ సైదులు, హసన్, టీవీకే నాగాచారి, వడ్డే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ఏన్కూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదవాసీ గిరిజనుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ లాల్‌మియా విమర్శించారు. శనివారం రాజలింగాల గ్రామంలో ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెసాచట్టం, అటవీహక్కుల చట్టం, జీవో నెంబరు 3ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. మండల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గసభ్యుడు మద్దెల పుల్లయ్య, అలివేలు, జోగ గురవయ్య, మద్దెల నారయ్య, కవిత, సీహెచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మండలంలో పెరుగుతున్న బొప్పాయిసాగు

▸▸ అధిక దిగుబడితోపాటు ఆదాయం

కారేపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సొంత భూములతోపాటుకౌలు భూములలో అధికంగా ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల బొప్పాయితో అధిక ఆదాయం వస్తుండడంతో పంట విస్తీర్ణంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం మండలంలో రెండు వందల ఎకరాలకుపైగా పంటసాగుఅవుతోంది. బొప్పాయికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతోపాటు ఇతర రాష్ట్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తున్నారు. పలు గ్రామాల్లో ఈ బొప్పాయి సాగుతోపాటు అంతర పంటలు సాగుచేస్తున్నారు. వాటిపై కోతులు దాడి చేసి ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఘోరంగా నష్టపోతున్నారు. అందుకే పంట మార్పిడిపై దృష్టి సాగిస్తున్నారు. బొప్పాయి పంటసాగుచేస్తున్న భూమి చుట్టూ సోలార్ విద్యుత్ సమకూరుస్తున్నారు. దీంతో కోతుల బెడదతోపాటు, దొంగతనాలు అరికట్టవచ్చేనే ఆలోచనతో రైతులు ఆలోచనచేస్తున్నారు. బొప్పాయి పండ్లు ప్రసుత్తం బీపీ, షుగర్ లాంటి వాధ్యులు అరికట్టేందుకు ఎంతో అవసరంగా పనిచేస్తుతుండడంతో పంటపై ఆదాయం కూడా అధికంగానే వస్తోంది.



మండలంలో సాగవుతున్న బొప్పాయితోట

ఘనంగా రాఖీ పౌర్ణమి

శనివారం శ్రావణ పౌర్ణమి రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు వారి సోదరులకు రాఖీలు కట్టి తమ అనురాగాన్ని చాటగా సోదరులు వారికి కానుకలు ఇచ్చారు. మెట్టినింటి నుంచి పుట్టింటికి రాఖీలు కట్టేందుకు మహిళలు పెద్దఎత్తున తరలిరావడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. వేకువజాము నుంచే మహిళలు భారీగా గ్రామాల్లోని తమ అన్నదమ్ముల ఇళ్లకు చేరుకున్నారు. బీజేపీ నాయకుడు తురక నారాయణ ఆధ్వర్యంలో అధికారులకు, వ్యాపారస్తులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా 'నాకు నీవు రక్ష, నీకు నేను రక్ష మన మంత దేశానికి రక్ష అంటు' నినాదాలు చేస్తు రాఖీలు కట్టారు.



అమ్మపాలెంలో రాఖీ కదుతున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి



వైరాలో చిన్నారులు..



లచ్చగూడెంలో రాఖీ పౌర్ణమి వేడుకలు



తల్లాడలో..



రాఖీ కదుతున్న ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి

ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలి

మధిర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ మధిర రూరల్, పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీహరి, శివరాజు సుమంత్ కార్యకర్తలను కోరారు. శనివారం మధిరలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీలు తీయాలని స్వాతంత్ర సమరయోధులను సన్మానించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, రామిశెట్టి నాగేశ్వరరావు, పాపట్ల రమేష్, కృష్ణారావు, శిలివేరు సాంబశివరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజేపి నాయకులు

ఘనంగా గిరిజన సంఘం వేడుకలు

కారేపల్లి ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కార్యాలయంలో శనివారం అదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నాయకులు అదివాసీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి ఎడాది ప్రపంచ అదివాసీ గిరిజన సంఘం దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతందన్నారు. అడవులు, పోడు భూముల నుంచి గిరిజనులను గెంటివేయడాన్ని ఆపాలన్నారు. పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజానీకం

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకోరు కొండి గ్రామంలో మంచినీటి సరఫరా సక్రమంగా జరగక పోవటంతో శనివారం స్థానిక ప్రజానీకం రోడ్డెక్కి ధర్నా చేశారు. స్థానికంగా రెండు దళిత కాలనీల్లో మూడు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచి పోవడంతో ఇబ్బందుల పడుతున్న ప్రజానీకం అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దకోరు కొండి గ్రామంలో వెన్నవల్లి వెళ్లే రహదారిలో గల గేట్‌వాల్ ఛాంబర్‌ను గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన భారీ వాహనాలు ఢీకొనంటంతో పైప్‌లైన్లు పగలటంతో మంచినీటి సరఫరా నిలిచి పోయిందని స్థానికులు తెలిపారు. గృహ అవసరాలకు నీరు లేక మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన అధికారులు పగిలిన మంచినీటి సరఫరా పైప్‌లైన్లను ఆధునీకరణ చేయాలని కోరారు. హైవే ఆథారిటి వారు పగలిన పైప్‌లైన్‌లను బాగు చేయిస్తామని చెప్పడమే కానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించక పోతే ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకోవెళ్తామని వారు హెచ్చరించారు.



పెద్దకోరుకొండిలో గ్రీన్‌ఫీల్డ్ హై వే వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్థులు

వైరాలో వేర్వేరుగా యూత్ కాంగ్రెస్ వేడుకలు



పొంగులేటి వర్గం ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్



కాంగ్రెస్ మండల కార్యాలయం వద్ద కేక్‌కట్ చేస్తున్న భట్టి వర్గీయులు

వైరా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం అఖిలభారత యూత్ కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రెండు వర్గాల వారు వేర్వేరుగా నిర్వహించారు. స్థానిక క్రాస్ రోడ్డు వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులైన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో అదేవిధంగా మండల కాంగ్రెస్ కార్యాలయం వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వర్గానికి చెందిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ముగ్గురు ఉపాధ్యక్షుల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. రెండుచోట్ల కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గరిడేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే భట్టి వర్గీయులు నిర్వహించిన వేడుకల్లో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తోటకూర గోపి, యిజ్జగాని నిప్పు, షేక్.జాన్‌పాషా, ప్రధాన కార్యదర్శి పిడియాల వినోద్, మాజీ అధ్యక్షుడు పమ్మి అశోక్ పాల్గొన్నారు.

దివ్యాంగుల మహా గర్జనకు బీజేపీ మద్దతు: నంబూరి

సత్తుపల్లి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో జరుగనున్న వికలాంగుల మహా గర్జనకు బీజేపీ పూర్తి మద్దతును ఇస్తున్నట్లు ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా సత్తుపల్లిలోని జేవీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సభలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను నంబూరి శాలువాతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 20నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఒక్కపైసా పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ఈ గర్జనకు జిల్లావ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులు తరలి రావాలని కోరారు. వివక్షతకు గురైన వికలాంగులు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలు, తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.15వేలుగా ఫించన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో జరిగే మహా గర్జన సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు వీరంరాజు, బానోత్ విజయ్, సాలి శివ, నరేష్, మట్టా ప్రసాద్, శివసాయి పాల్గొన్నారు.



మంద కృష్ణను సన్మానిస్తున్న నంబూరి

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలి

▸▸ టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్రావు

బోనకల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామిలను ప్రభుత్వం నేరవేర్చాలని టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి గోపగాని శంకర్రావు విజ్ఞప్తి చేశారు. బోనకల్‌లో శనివారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. విస్తృతంగా టీజేఎస్ సభ్యత్వ నమోదును చేపట్టి స్థానిక పోరులో సత్తా చాటాలని కోరారు. యూరియ కొరత లేదని మంత్రులు ఒకపక్క చెబుతుండగా, మరోవైపు అధికారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి కూడ ఆర్థిక సాయం ప్రభుత్వం ఇచ్చే విదంగా తమ పార్టీ అధినేత కొందరాం కృషి చేయనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అదికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం అబినందనీయమన్నారు. అనంతరం చిరునోములలో ఉద్యమకారుడు రేగళ్ల వీరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతడిని పరామర్శించారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ సర్దార్ హుస్సేన్, కార్యదర్శి బట్టు రాజేందర్‌నాయక్, మండల అధ్యక్షుడు బీరెల్లి వాసు, తాళ్లూరి శ్రీను, బీరెల్లి కృష్ణ, రంగయ్యశాస్త్రీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్రావు

శిథిలమైన తాగునీటి ట్యాంకుల నిచ్చెనలు

▸▸ పట్టించుకోని అధికారులు

▸▸ క్లోరినేషన్ లేక అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల (ట్యాంకుల) నిచ్చెనలు తుప్పు పట్టి శిథిలం కావటంతో ఆయా పథకాలు పరిశుభ్రతకు నోచుకోక, కోర్లినేషన్ కాని మంచినీటి సరఫరా చేయటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. నెలల తరబడి మండల పరిధిలోని పేరువంచ, మర్లపాడు, చెన్నూరు, చంద్రుపట్ల, రఘునాథగూడెం, లింగాల, కల్లూరు, తదితర గ్రామాల్లో మంచినీటి పథకాల నిచ్చెనలు శిథిలం కావటంతో వాటిని గ్రామ పంచాయితీల పరిధిలో గల సిబ్బంది ట్యాంకులపైకి ఎక్కి శుభ్రం చేయాలంటే భయాందోళనకు గురియైతున్నారు. శిథిలమైన మంచినీటి ట్యాంకుల నిచ్చెనలు పాడైనప్పటికి సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదని ఆయా గామాల ప్రజానీకం విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయితీల పరిధిలో తాము నిధుల కొరతతో ఆర్థిక ఇబ్బందులు పడుతన్నామని ఇక శిథిలమైన ట్యాంకుల నిచ్చెనలకు ఏలా మరమ్మత్తులు చేయించాలని మరో వైపున కార్యదర్శిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాల కాల సీజన్ కావటంతో రక్షిత మంచినీటి పథకాల ద్వారా అపరిశుభ్రమైన మంచినీటిని అందింటంతో ఆ నీరు త్రాగి దురద, జలుబు, దగ్గు వంటి శరీరక అంటు వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో మంచినీటి పథకాల నిచ్చెనలు విరిగి శిథిలమైనప్పటికి గ్రామ పంచాయితీ కార్యదర్శిలు, ప్రత్యేక అధికారులు వాటి మరమ్మత్తుల విషయమై ఏమాత్రం పట్టించుకోవటం లేదని విమర్శిలు వస్తున్నాయి. ఆయా పథకాల ద్వారా గ్రామాల్లో మంచినీరు అందిస్తున్నప్పటికి ప్రజలు ఆ నీటిని త్రాగలేక పోతున్నార౦. ఇప్పటికైన అధికారులు స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలిని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిఓ రంజిత్ కుమార్‌ను వివరణ అడగగా శిథిలమైన మంచి నీటి పథకాలను మరమ్మత్తులు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.





మర్లపాడులో నిచ్చెన విరిగిన దృశ్యం, చెన్నూరులో నిచ్చెన శిథిలమైన దృశ్యం

ఇది ఆర్అండ్‌బీ రోడ్డేనా?

▸▸ వాగును తలపిస్తున్న రోడ్డు

వైరా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి-చిన్నమునగాల ఆర్‌అండ్‌బీ రోడ్డు అత్యంత అధ్వానంగా ఉంది. మరీ ముఖ్యంగా తాటిపూడి సెంటర్ వద్ద 2నుంచి 3అడుగుల లోతుతో భారీ గుంతలేర్పడ్డాయి. రోడ్డు మొత్తం కుంగిపోయింది. రోడ్డు పక్కన నివాసాల నుంచి వచ్చే మురుగునీరు ఈ గుంతలో చేరి వాగును తలపిస్తోంది. రోడ్డుపై రెండు అడుగుల లోతు గుంతలో మురుగునీరు చేరింది. పాదచారులు ఈ మురుగునీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. వైరా మండలంలోని తాటిపూడి-కొణిజర్ల మండలంలోని చిన్నమునగాలకు ఈ రోడ్డు చాలా కీలకంగా ఉంది. వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఈ రోడ్డు అనుసంధానంగా ఉంది. తాటిపూడి నుంచి చిన్నమునగాల, పెద్ద మునగాల, పెద్దగోపతి, చిన్నగోపతి, అమ్మపాలెం మీదుగా తనికెళ్ల జాతీయ ప్రధాన రహదారికి ఈ రోడ్డు కలుస్తుంది. 2016లో తనికెళ్ల నుంచి పెద్దమునగాల వరకు దాదాపు 13కిలో మీటర్ల ఒక వరుస రోడ్డును రెండు వరుసల రోడ్డుగా నిర్మించారు. పెద్దమునగాల నుంచి చిన్నమునగాల మీదుగా తాటిపూడి వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు ఒక వరుసతోనే ఉంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల వారు, వైరా మండలంలోని అనేక గ్రామాల వారు ఈ రోడ్డు గుండానే ఖమ్మానికి రాకపోకలు కొనసాగిస్తున్నారు. చిన్నమునగాల ప్రజలకు ఈ రోడ్డే దిక్కుగా ఉంది. తాటిపూడిలోని అత్యధిక మంది ప్రజలు ఈ రోడ్డునే ఉపయోగించుకుంటున్నారు. అలాంటి ఈ రోడ్డు కనీసం పాదచారులు వెళ్లే పరిస్థితి కూడా లేనప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఈ గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ రోడ్డు మరమ్మతుకు తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరుతున్నారు.



తాటిపూడి-చిన్నమునగాల రోడ్డుపై ఉన్న గుంతల్లో చేరిన మురుగునీరు

పొంగులేటికి రాఖీ కట్టిన ఉమాదేవి

వైరా, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వైరా మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి రాఖీ కట్టారు. శనివారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటిని తన భర్త రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్‌తోపాటు కలిసిన ఉమాదేవి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపి మంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు.



పొంగులేటికి రాఖీ కడుతున్న బొర్రా ఉమాదేవి పక్కన భర్త రాజశేఖర్

ఐక్యతకు ఆదివాసీలే నిదర్శనం: ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఐక్యతకు ఆదివాసీలే నిదర్శనమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మునిసిపల్ ఆఫీస్ సమీపంలోని కొమరంబీమ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌తో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

బెటాలియన్‌లో

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డి.రంగారెడ్డి ఏకలవ్యుడి విగ్రహం వద్ద పూలుజల్లి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలపు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం

ఆదివాసీ హక్కుల పరిరక్షణకై ఉద్యమిద్దామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొర్సా వెంకటేష్, దుంపా రాఘవులు, ఆదాం సాహెబ్, మారుతి శ్రీను, పుచ్చ కృష్ణవేణి, కృష్ణ, సంగం అరుణ్‌కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



కొమరం భీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



బెటాలియన్‌లో..